క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

కర్నూలు (టౌన్): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మనోహర్, వెంకటేశ్వర్లు విన్నవించారు. సోమవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని కర్నూలు ప్రగతి కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీహర్షను కలిసి విన్నవించారు. తమకు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లో రూ.13 వేల జీతంతో కార్మికులు వారి కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం కాలయాపన చేయడం మంచి పద్ధతి కాదన్నారు. మానవత్వ కోణంలో ఆలోచించి కార్మికుల శ్రమను, దోపిడీ చేయకుండా వెంటనే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్‌ను కలిసిన మునిసిపల్ కమిషనర్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.విశ్వనాథ్ సోమవారం కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

'రహస్యంగా ఏపీ ఎన్‌జీఓ తాలూకా ఎన్నికలు'

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలోని తాలూకాలకు రాష్ట్ర సంఘం అనుమతి లేకుండా ఎన్నికలు నిర్వహించరాదని ఇచ్చిన ఆదేశాలను ఏపీ ఎన్‌జీఓ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డి ఖాతరు చేయకుండా ఎన్నికలు నిర్వహించడం దారుణమని జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీ రమణ అన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్నికల నిర్వహణపై ఆదేశాలు జారీ చేశారని, వాటిని ఖాతరు చేయకుండా ఏకపక్షంగా, అత్యంత రహస్యంగా ఎన్నికలు నిర్వహించడం అనేక అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. సభ్యత్వ రుసుం వసూలు చేసి సంఘం బ్యాంకు ఖాతాకు జమ చేయలేదని చెప్పారు. ఓటరు లిస్టుకు సంఘం బైలా ప్రకారం ఆమోదం తీసుకోవాల్సి ఉండగా ఏమీ పట్టించుకోలేదన్నారు. ఈ నెల చివర్లో పదవీ విరమణ చేస్తున్నారని, ఆ లోపు అన్ని తాలూకాలకు గుట్టుచప్పుడు కాకుండా ఆఫీసు బేరర్లను నియమిస్తున్నారని చెప్పారు. రహస్యంగా నిర్వహించిన తాలూకా సంఘాల ఎన్నికలపై రాష్ట్ర సంఘానికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర సంఘం అనుమతి లేకుండా జరిపిన ఎన్నికలను చెల్లనివిగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

ధూమపానంతో క్షయ ముప్పు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు, వైద్యాధికారులు

కర్నూలు(రూరల్): పొగతాగే అలవాటు ఉన్న వారికి క్షయ వ్యాధి వచ్చే అవకాశం ఉందని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ తెలిపారు. సోమవారం కర్నూలు మండలం ఇ.తాండ్రపాడు గ్రామంలో నిర్వహించిన టీబీ ముక్త అభియాన్ కార్యక్రమంలో కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వ్యాధిగ్రస్తులకు సరుకులు ఉచితంగా అందచేశారు. జిల్లా న్యూక్లియస్, మెడికల్ ఆఫీసర్, మల్లికార్జున, అధికారులు మక్బుల్ సాహెబ్, నిర్మలాదేవి,ధనమ్మ, నిషిత్ ల్యాబ్ పాల్గొన్నారు.

దళిత శ్మశాన వాటికలో సదుపాయాలేవీ?



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలులోని బుధవారపేట సమీపంలో ఉన్న దళిత శ్మశాన వాటికలో కనీస మౌలిక వసతులు లేకపోవడం అన్యాయమని ఎస్‌జీకేఎస్ రాష్ట్ర నాయకులు ఎన్‌జీ కృష్ణ, ఓల్డ్‌సిటీ కేవీపీఎస్ అధ్యక్షుడు రెడ్డిపోగు రమణ, స్థానిక కేవీపీఎస్ నాయకులు విమర్శించారు. వారు సోమవారం శ్మశాన వాటికలో పర్యటించారు. ఎక్కడపడితే అక్కడ పెద్ద గుంతలు ఉండడం, చెట్లు విపరీతంగా పెరిగిపోవడంతో లోపలికి వెళ్లలేని పరిస్థితులు ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల రూ.70 లక్షల నిధులతో శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని కార్పొరేషన్ నిర్ణయించింది. అయితే కేవలం మంత్రి టీజీ భరత్ వేసిన శిలాఫలకం తప్పా ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదని, ఇందుకోసం వెచ్చించిన రూ.70 లక్షలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

వైద్యం.. అపు'రూపం'

- ప్లాస్టిక్ సర్జరీలో విప్లవాత్మక మార్పులు
- దెబ్బతిన్న శరీర భాగాల స్థానంలో సర్జరీతో యథాస్థితి
- పెద్దాసుపత్రిలో ఏటా 900 దాకా ఆపరేషన్లు
- రెండేళ్ల క్రితం పీజీ సీట్లు మంజూరు
- నేడు జాతీయ ప్లాస్టిక్ సర్జరీ దినం

కర్నూలు(హాస్పిటల్): సీనియర్ ఎన్‌టీ రామారావు నటించిన పాతాళభైరవి సినిమాలో అమ్మవారికి పూజలు చేసే సమయంలో మాంత్రికుడు తన తల, చేతిని నరుక్కుని తిరిగి అతికించుకుంటారు. రెండు దశాబ్దాల క్రితం వచ్చిన ఆంగ్ల చిత్రం ఫేస్ ఆఫ్ సినిమాలోనూ హీరో ముఖాన్ని ప్లాస్టిక్ సర్జరీ ద్వారా మారుస్తారు. కొన్నేళ్ల క్రితం వచ్చిన ఎవడు అనే తెలుగు సినిమాలోనూ హీరో చనిపోతే అతనికి మరో వ్యక్తి ముఖాన్ని ప్లాస్టిక్ సర్జరీ ద్వారా రూపుదిద్దుతారు. ఈ విధంగా ప్లాస్టిక్ సర్జరీ అనే విధానంలో కథలు రూపొందించుకుని అనేక సినిమాలు తీసి హిట్ కొట్టారు. ఆధునిక ప్లాస్టిక్ సర్జరీ విధానంలో నఖ..శిఖ పర్యంతం మనకు కావాల్సిన విధంగా మార్చుకుంటూ అందంగా మారుతున్న వారిని మనకళ్ల ముందు చూస్తున్నాం. ఈ నెల 15న జాతీయ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కథనం.

ప్లాస్టిక్ సర్జరీలోని ప్లాస్టిక్ ప్లాస్టికోస్ అనే గ్రీకు పదం నుంచి వచ్చింది. ప్లాస్టికోస్ అంటే మలచడం అని అర్థం. ఏవైనా ప్రమాదాలు జరిగినా, జన్మతః వికారమైన ఆకారం వచ్చినా ఆ వికారాన్ని ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు అందంగా రూపుదిద్దుతున్నారు. మన శరీరంలో ఏదైనా ఒక భాగం రెండుగా విరిగితే తగిన సమయంలో వైద్యుల వద్దకు తీసుకురాగలిగితే ఆధునిక టెక్నాలజీ ద్వారా అతికించగలిగే సాంకేతిక నేడు అందుబాటులోకి వచ్చింది. పాతికేళ్ల క్రితం కర్నూలు నగరంలో ఇద్దరు మాత్రమే ప్లాస్టిక్ సర్జన్లు ఉన్నారు. దీంతో అప్పట్లో ప్లాస్టిక్ సర్జరీ ఆపరేషన్ చేయించుకోవాలంటే కొన్నిసార్లు నెలల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. ఈ విభాగంలో పీజీ సీట్ల సంఖ్య పెరగడంతో ఇప్పుడు వీరి సంఖ్య ప్రస్తుతం గణనీయంగా పెరిగింది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనే ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ముగ్గురు పీజీలు సేవలందిస్తున్నారు. దీంతో ఇప్పుడు కేవలం వారం, పదిరోజుల్లోనే ఆపరేషన్ చేస్తున్నారు. ఈ విభాగంలో ప్రస్తుతం గ్రహణమొర్రి, పుట్టుకతో వచ్చే అంగ వైకల్యాలను సరిచేయడం, ఫేషియల్ సర్జరీ, ట్రామా అండ్ మ్యాక్సిలో ఫేసియల్ ఫ్రాక్చర్స్, రీ కన్స్ట్రక్టివ్ సర్జరీ, కాస్మొటిక్స్, ముక్కు సర్జరీ, ముఖంపై గాయాలు, చేతిగాయాలకు చికిత్స, చర్మం వేయడం, ఫ్లాప్‌సర్జరి, హైపోస్పేడియాసిస్, కాలినగాయాలకు చికిత్స, గైనకోమాస్టియా(మగ వారిలో పెరిగిన రొమ్ములను సరిచేయడం), రొమ్ము పెంచడం వంటి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

పెద్దాసుపత్రిలో ఆధునిక సేవలు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగంతో పాటు దానికి అనుబంధంగా కాలిన రోగుల వార్డులో ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ విభాగానికి కర్నూలు, నంద్యాలతో పాటు వైఎస్ఆర్ కడప జిల్లా, రాయచోటి, అనంతపురం, శ్రీసత్యసాయి, ప్రకాశం, కర్నాటకలోని బళ్లారి, రాయచూరు, తెలంగాణాలోని మహబూబ్‌నగర్, గద్వాల జిల్లా వాసులూ చికిత్స కోసం వస్తున్నారు. గత సంవత్సరం ఈ విభాగంలో 3,986 మందికి ఓపీ సేవలు అందించగా, ఇన్‌పేషంట్లుగా 767 చేరారు. వారిలో 548 మందికి మైనర్, 343 మేజర్ ఆపరేషన్లు చేశారు. ఈ యేడాది గత ఆరు నెలల కాలంలో 2,600 మందికి ఓపీ సేవలు, 1,050 మందికి ఐపీ సేవలు, 750 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. అంటే గత సంవత్సరం కంటే ఈ యేడాది మరింత మంది ఇక్కడ సేవలు ఉపయోగించుకున్నారు. అలాగే నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ ది బర్న్ ఇన్‌జ్యూరీస్(ఎన్‌పీపీడీబీఐ) కింద కేంద్ర ప్రభుత్వం 2017 మార్చిలో రూ.4.5కోట్ల ప్రాజెక్టును మంజూరు చేసింది. ఈ భవనాన్ని 2014 మార్చిలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఒకప్పుడు పాత భవనంలో కాలినరోగులకు వైద్యసేవలు అందేవి. ఇప్పుడు ఆదునిక భవనంలో మెరుగైన వసతుల మధ్య చికిత్స అందుకుంటున్నారు.



ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు



ముఖంపై ఏర్పడిన కణితిని తొలగించిన దృశ్యం



ప్లాస్టిక్ సర్జరీ విభాగం

మెరుగైన వైద్యమందించడమే లక్ష్యం



రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా మా వైద్యబృందం పని చేస్తోంది. హైదరాబాద్‌కు దీటుగా కార్పొరేట్ స్థాయిలో మేం రోగులకు సేవలందిస్తున్నాం. అత్యవసరమైన వారికి వెంటనే ఆపరేషన్ చేస్తున్నాం. మా విభాగంలో ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం వైద్యులు ఉండటం వల్ల పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు రోగులకు సత్వర వైద్యాన్ని అందించగలుగుతున్నాం. జాతీయ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15న మెడికల్ కాలేజీ ఆవరణలోని శుశృతుడు విగ్రహానికి పూలమాల వేసి, అనంతరం న్యూ బర్న్స్ వార్డులో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. – **డాక్టర్ మంజులబాయి, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌ఓడీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల**

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ శాఖకు సంబంధించి అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు కర్నూలు అర్బన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. స్టాంటన్‌పురం, మమత నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఫ్యామిలీ పార్కు ఏర్పాటు చేయండి

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలో అతి పెద్ద కాలనీగా ఉన్న నాలుగవ తరగతి ఉద్యోగుల కాలనీలో అన్యాక్రాంతమైన పార్కులను స్వాధీనం చేసుకొని, కాలనీలో ఫ్యామిలీ పార్కును ఏర్పాటు చేయాలని నాలుగవ తరగతి ఉద్యోగుల కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థలో నూతన కమిషనర్ పి.విశ్వనాథ్‌ను కలిసి శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కాలనీలో సాయంత్రం వేళ కుటుంబ సభ్యులతో సేద తీరేందుకు ఒక మంచి పార్కు లేదని, అధికారులు చర్యలు చేపట్టి పార్కును ఏర్పాటు చేయాలని కోరారు.

పంట బీమా నమోదుకు చర్యలు

కర్నూలు(సెంట్రల్): వాతావరణ ఆధారిత పంటల బీమా, ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ అధికారులను ఆదేశించారు. సోమవారం డీఆర్వో కార్యాలయంలో బీమాపై బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలతో ఆమె జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. వాతావరణ ఆధారిత పంటల బీమా నమోదుకు నేడు ఆఖరు కావడంతో రైతులతో మాట్లాడి బీమా చేయించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. మరోవైపు రైతులు పంట రుణాలు తీసుకున్న సమయంలోనే బీమా చేయించుకునేలా కృషి చేయాలని బ్యాంకులకు సూచించారు.

పేదలకు అందని సంక్షేమ పథకాలు



కల్లూరు అర్బన్‌లో కూటమి ప్రభుత్వ మోసాలను నమోదు చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- కల్లూరులో బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం

కల్లూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు సంక్షేమ పథకాలు అందడం లేదని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 32వ వార్డులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వంచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని ఇంటింటికి తిరుగుతూ ఏడాది కాలంలో వివిధ సంక్షేమ పథకాలు అందక ప్రతి కుటుంబం ఎంతో మోసపోయింది ముజఫర్‌నగర్‌లో ప్రజలకు వివరించారు. కాలనీలో ఎవరిని పలకరించినా సంక్షేమ పథకాలు అందడం లేదని, ప్రతిదాంట్లో కోతలు పెట్టి కొందరికే ఇస్తున్నారని ప్రజలు కాటసానికి తమ గోడువెళ్లబోసుకున్నారు. కాటసాని మాట్లాడుతూ చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలు గమనించాలన్నారు. కాలనీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ను ప్రజలతో స్కాన్ చేయించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సాన శ్రీనివాసులు, నరసింహులు, నారాయణరెడ్డి, భీమేశ్వర్ రెడ్డి, రంగప్ప, భవాని, మోహన్, శ్రీను. గోపి, షేక్షావలి, హుస్సేన్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో సత్తా చాటాలి

కర్నూలు (టౌన్): ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్ సింగ్‌హజంజా ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటాలని కిక్ బాక్సింగ్ అకాడమీ చైర్మన్ డాక్టర్ త్రినాథ్ పిలుపునిచ్చారు. స్థానిక గాయత్రి ఎస్టేట్‌లోని అకాడమీలో జాతీయ పోటీల్లో పాల్గొనే సుజిత్, హరి కళ్యాణ్, అశోక్, ఎరుకల సుధీర్, జయ కళ్యాణ్, ఉపేంద్ర, హరిచంద్ర ప్రసాద్, మురళీ మోహన్‌లను ఆయన అభినందించారు.

పోకిరీలపై ప్రత్యేక నిఘా

కర్నూలు: విద్యాసంస్థల వద్ద తిష్ట వేసి ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న పోకిరీలపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. కొంతమంది ఆకతాయిల వల్ల విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మహిళల నుంచి ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తడంతో మఫ్టీ బృందాలను నియమించి నిఘా ఏర్పాటు చేశారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమా ఆర్కేడ్‌లో ఉన్న నారాయణ జూనియర్ కాలేజీ, కేవీఆర్ కాలేజీ, మౌర్యా ఇన్ సర్కిల్ వద్ద ఉన్న చైతన్య కాలేజీ వద్ద పోలీసు సిబ్బంది సోమవారం మారు వేషంలో ఉండి ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న 20 మంది పోకిరీలను అదుపులోకి తీసుకుని, వారి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కాలేజీల వద్ద మాటు వేసి అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే భవిష్యత్తులో చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించి పంపారు. సీఐ జీవీ నాగరాజరావు, ఎస్‌ఐలు సతీష్‌కుమార్, మల్లికార్జునతో పాటు సిబ్బంది ఆయా కళాశాలల వద్ద మారువేషంలో ఉండి పోకిరీల భరతం పట్టారు. ఇకపై కాలేజీల వద్ద నిరంతర నిఘా ఉంటుందని, ఈవ్ టీజింగ్‌కు పాల్పడే విద్యార్థులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ నాగరాజరావు హెచ్చరించారు.



పట్టుబడిన పోకిరీలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నాగరాజరావు

మౌలిక సదుపాయాలు కల్పించండి

- సీతారామనగర్, కారల్ మార్క్స్ నగర్‌లో వీధిలైట్లు వెలగడం లేదు
- కమిషనర్‌కు సమస్యలు వివరించిన స్థానిక వాసులు

కర్నూలు (టౌన్): వెంకటాద్రి నగర్‌లో ఇళ్ల వద్ద పైపులైన్లు ఏర్పాటు చేయాలని స్థానికులు బొగ్గుల రాజేశ్వరి విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కాలనీల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, మున్సిపల్ ఇంజనీర్ లీలా ప్రసాద్ పాల్గొన్నారు.


ఫిర్యాదులు ఇవే..

➤ క్లాప్ ఆటో డ్రైవర్లకు వేతన బకాయిలు చెల్లించాలని, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఐటీయూ ప్రతినిధులు అంజి, మద్దిలేటి కోరారు.

➤ హెచ్‌డీసీటీ ఆసుపత్రి నుంచి బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో సీతారామ నగర్, కారల్ మార్క్స్ నగర్‌లో వీధిదీపాల సమస్య ఉందని స్థానికులు విన్నవించారు.

➤ పెద్దపాడు, లక్ష్మీ విల్లాస్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కాశిరెడ్డి, లక్ష్మీ, సంజన్న వినతిపత్రం అందజేశారు.

➤ ఏ.క్యాంపు భరత్ నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానిక మహిళలు సరోజమ్మ, వేణుగోపాల్ కోరారు.



అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

- పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక క్యాంపులు
- టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించిన కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టరేట్ నుంచి శానిటేషన్, సీజనల్ వ్యాధులు, టేక్ హోం రేషన్ అంశాలపై నియోజకవర్గ, మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, ఈఓఆర్‌డీలు, సీడీపీఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలం మొదలైనందున ప్రత్యేక శానిటేషన్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ఇంటంటికీ వెళ్లి చెత్త సేకరణ, డ్రైనేజీలను శుభ్రం చేయడం, తాగునీటి పైపుల లీకేజీలను అరికట్టడం, ట్యాంకులను శుభ్రం చేసే పనులను నిరంతరం చేపట్టేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. చిప్పగిరి మండలం ఏరూరు, కోడుమూరు మండలం కోడుమూరు-3, ప్యాలకుర్తి, హోళగుంద మండలం హెబ్బటం, కోసిగి మండలం చీర్తనకల్, ఓర్వకల్ మండలం లొద్దిపల్లె, పెద్దకడుబూరు మండలం నౌలేకల్ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంపై ఫిర్యాదులు రావడంతో ఆయా మండలాల ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలను హెచ్చరించారు. ఆయా గ్రామాలను అధికారులు సందర్శించి తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సక్రమంగా పనిచేయని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని మునిసిపాలిటీల్లో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. జిల్లాలో అక్కడక్కడా చికెన్‌గున్యా వ్యాధి ప్రబలుతోందన్నారు. వ్యాధులు ప్రబలకుండా డ్రైనేజీల క్లీనింగ్, ఫాగింగ్, డ్రై డే తదితర చర్యలు చేపట్టాలన్నారు. సీబెళగల్, కృష్ణగిరి, కర్నూలు మండలాల్లో డెంగ్యూ కేసులు నమోదు కావడంతో ఆయా మండలాల అధికారులతో ఆరా తీశారు. ఆదోని, దేవనకొండ, హాలహర్వి, కృష్ణగిరి మండలాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి రాలేదని, త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఆలూరు మండలంలో 34 ట్యాంకుల్లో 9 మాత్రమే క్లీనింగ్ చేశారని, మిగతా వాటిని ఎందుకు చేయలేదని ఎంపీడీఓను ప్రశ్నించారు. పంచాయతీ సెక్రటరీపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని డీపీఓను ప్రశ్నించారు. జిల్లా బాల సంజీవని, టేక్ హోం రేషన్ కిట్ల పంపిణీ సరిగాచేపట్టాలని సీడీపీఓలను ఆదేశించారు. ఆయా వివరాలను పోషణ్ యాప్‌లో నమోదు చేయడంలో ఆదోని, ఎమ్మిగనూరు సీడీపీఓలు వెనుకబడి ఉన్నారని, అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇప్పించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ నిర్మలను ఆదేశించారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరాజు, డీపీఓ భాస్కర్, మలేరియా అధికారి నూకరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

- 17న జాబ్‌మేళా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

కర్నూలు(సెంట్రల్): అధికార యంత్రాంగం ఏర్పాటు చేసే జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. ఈనెల 17న ఆదోనిలో జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జాబ్ మేళాపై ముద్రించిన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఆదోని సాయి డిగ్రీ కాలేజీలో నిర్వహించే జాబ్‌మేళాలో 11 ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటాయని, 450 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ చదివి 18 నుంచి 35 సంవత్సరాల వయసున్న యువత అర్హులని, అర్హులైన వారు nai punya-m.a p.g-ov.i n వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. సందేహాలుంటే 99854 96587, 97039 93995 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎక్స్‌రేలకు డబ్బులు వసూలు చేయొద్దు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎక్స్‌రేలకు డబ్బులు వసూలు చేయడం ఆపాలని ప్రజాపరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కె.బలరామ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ ఎక్స్‌రేలకు డబ్బులు వసూలు చేయడం లేదని, కేవలం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో వసూలు చేయడం సిగ్గుచేటన్నారు. పేదవారు ఆసుపత్రికి వస్తే ముక్కుపిండి ఎన్ని ఎక్స్‌రే ఫిల్ములు ఉంటే అన్నింటికీ ఒక్కో దానికి రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారని, దీనివల్ల పేదలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. ఇందుకోసం గంటల కొద్దీ రోగులు క్యూలో నిల్చోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో ఎక్స్‌రేకు డబ్బులు వసూలు చేయడాన్ని ఆపేయాలని డిమాండ్ చేశారు.

నర్సింగ్ సిబ్బంది రోస్టర్‌లో అవకతవకలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేసే స్టాఫ్‌నర్సుల డ్యూటీ రోస్టర్‌లో అవకతవకలు జరుగుతున్నాయని ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సభ్యులు బి.రామాంజనేయులు సోమవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ఫిర్యాదు చేశారు. వికలాంగ నర్సులను బిజీగా ఉండే వార్డులో డ్యూటీ వేసి సాధారణ నర్సులను తక్కువ పని ఉన్న వార్డులో డ్యూటీ రోస్టర్ వేస్తున్నారని విమర్శించారు. 8 సంవత్సరాలుగా ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ నర్సెస్‌కు డ్యూటీ చేయడం లేదని, కానీ మెడికల్ బోర్డు నుంచి మినహాయింపు పొందిన నర్సులకు నైట్ డ్యూటీ వేస్తున్నారని ఆరోపించారు. నర్సింగ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జూనియర్ హెడ్ నర్సులు ఉండాలని, డీఎంఈ నిబంధనల ప్రకారం సీనియర్ హెడ్ నర్సులు ఉండాలన్నారు. రోస్టర్‌లో జరిగే అవకతవకలపై విచారణ జరిపించాలని కోరారు.

బీసీ మహిళలపై దాడులు సిగ్గుచేటు




మాట్లాడుతున్న రాఘవేంద్రనాయుడు

కర్నూలు (టౌన్): రాష్ట్రంలో రోజురోజుకు మహిళలపై దాడులు పెరుగుతున్నాయని, చివరకు బీసీ మహిళలను సైతం టార్గెట్ చేసి దాడులకు తెగబడటం సిగ్గుచేటు అని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్రనాయుడు విమర్శించారు. సోమవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో బడుగు, బలహీన వర్గాలు, బీసీలపై దాడులు పెరిగిపోయాయన్నారు. జిల్లాకు ప్రథమ పౌరురాలు, బీసీ మహిళ, కృష్ణా జిల్లా జెడ్పీ చైర్మన్ ఉప్పల హారికపై హత్యాయత్నం, దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీసీలు అంటే ఈ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో ఈ ఘటన స్పష్టంగా తెలియజేస్తుందన్నారు. గతంలో నంద్యాల జిల్లా మీదివేముల మాజీ ఎంపీటీసీ బోయ రమేష్ నాయుడును దారుణంగా హత్య చేశారన్నారు. కూటమి పాలనలో రాష్ట్రంలో ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట బీసీలపై దాడులు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి పెద్ద పీట వేసి ఎంతో గౌరవం కలిపించారని గుర్తుచేశారు. ఎమ్మెల్యేలుగా, జిల్లా పరిషత్తు చైర్మన్లుగా, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లుగా, మున్సిపల్ చైర్‌పర్సన్లుగా, వివిధ ప్రభుత్వ సంస్థల చైర్‌పర్సన్లుగా, జెడ్పీటీసీలుగా, ఎంపీటీసీలుగా, పంచాయతీ ప్రెసిడెంట్లుగా అవకాశాలు కల్పించారన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలుచేసి రాజకీయ అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బీసీలను అణగదొక్కుతోందని విమర్శించారు. చంద్రబాబు ఏడాది పాలనపై అన్ని వర్గాల వారు విసుగు చెందారన్నారు. ఇప్పటికైనా దాడులు ఆపకపోతే బీసీలంతా ఏకమై తమ సత్తా చూపుతామని స్పష్టం చేశారు.

పదోన్నతులు చేపట్టకుండా నియామకాలు వద్దు

కర్నూలు(హాస్పిటల్): ముందుగా పదోన్నతులు కల్పించకుండా వైద్యుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడం అన్యాయమని ప్రభుత్వ వైద్యుల సంఘం కర్నూలు శాఖ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్ అన్నారు. రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో 77 ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఈ నెల 17న వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఇచ్చిన నోటిఫికేషన్‌ను నిరసిస్తూ ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి వైద్యులు నిరసన తెలిపారు. సంఘం అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్ మాట్లాడుతూ.. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌పై తమకు అభ్యంతరాలు ఉన్నాయన్నారు. కాంట్రాక్ట్ విధానంలో 40 ప్రొఫెసర్లు, 37 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల కోసం నోటిఫికేషన్ జారీ కావడం దారుణమని, దీనివల్ల వైద్యుల పదోన్నతులపై ప్రభావం పడుతుందన్నారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఖాళీల కంటే పదోన్నతులకు అర్హులైన వారి సంఖ్య రెట్టింపుగా ఉందని, పదోన్నతులు కల్పించకుండా కాంట్రాక్టు పద్ధతిలో వైద్యుల పోస్టులను ఎలా భర్తీ చేస్తారని ప్రశ్నించారు. వెంటనే నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం ట్రెజరర్ డాక్టర్ దమామ్ శ్రీనివాసులు, నాయకులు డాక్టర్ రామశివనాయక్, డాక్టర్ శారద, డాక్టర్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో నిరసన తెలుపుతున్న వైద్యులు